# మాంద్యం ముంచుకురావొచ్చు

**అధిక ధరలు, భౌగోళిక ఉద్రిక్తతలు కారణం • కేంద్ర ఆర్థిక శాఖ రిపోర్ట్**



న్యూఢిల్లీ, నవంబర్ 21: మాంద్యం ముప్పు నుంచి ఆర్థిక వ్యవస్థ ఇంకా బయటపడలేదన్న సంకేతాల్ని కేంద్ర ఆర్థిక శాఖ తాజాగా వెల్లడించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నడుమ ఆహారోత్పత్తులు, ఇంధన ధరలు అధికస్థాయిలో కొనసాగుతున్నందున 2024లో మాంద్యం ముంచుకొచ్చే అవకాశం ఉందని కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన రిపోర్ట్‌లో హెచ్చరించింది. 2023 అక్టోబర్‌లో ఆర్థికవ్యవస్థ తీరుతెన్నులపై కేంద్రం తాజాగా ఒక సమీక్షా నివేదికను వెలువరించింది. ప్రపంచ వాణిజ్య పరిమాణం తగ్గుతున్నట్టు డబ్ల్యూటీవో గణాంకాలు చెపుతున్నాయని, ఈ నేపథ్యంలో భారత్ ఎగుమతుల విలువ క్షీణించడం, అదే సమయంలో దిగుమతులు విలువ పెరుగుతున్నదని, దీంతో అక్టోబర్‌లో వాణిజ్యలోటు రికార్డు గరిష్ఠానికి చేరిందని ఆర్థిక శాఖ వివరించింది. ఎగుమతులతో పోలిస్తే దిగుమతులు అధిక శాతం పెరుగుతున్నందున వాణిజ్యలోటు విస్తృతమవుతున్నదని పేర్కొంది. 2022 అక్టోబర్‌తో పోలిస్తే 2023 అక్టోబర్‌లో పండుగ డిమాండ్‌తో వెండి, బంగారం దిగుమతులు దాదాపు రెట్టింపు అయ్యాయన్నది. గ్రామీణ డిమాండ్ క్యూ1కంటే క్యూ2లో ఊపందుకుందని, ఆహార ధాన్యాల దిగుబడి ద్వారా స్థిరమైన ఆదాయం లభించడం, ద్రవ్యోల్బణం నెమ్మదించడం ఇందుకు కారణమని తెలిపింది. లీజర్, బిజినెస్ ట్రావెల్స్ జోరుతో టూరిజం, హోటల్ పరిశ్రమలు వృద్ధిచెందుతున్నాయని, దీంతో ముడి వ్యయాలు పెరుగుతున్నప్పటికీ, సర్వీసుల రంగం సెంటిమెంట్ బలపడిందని పేర్కొంది. అయితే రిజర్వ్‌బ్యాంక్ వరుస వడ్డీ రేట్ల పెంపు, ఇతర పాలసీ చర్యలు వ్యవస్థలోకి పూర్తిమార్పిడి జరిగిన తర్వాత దేశీయ డిమాండ్ తగ్గవచ్చని మంత్రిత్వ శాఖ అంచనా వేసింది.




మంగళవారం న్యూఢిల్లీలో దివ్యాంగుల సౌకర్యార్థం 'సమర్థ్' పేరిట ప్రత్యేక వ్యవస్థను పరిచయం చేస్తున్న హ్యుందాయ్ కంపెనీ ప్రతినిధులు. చిత్రంలో బాలీవుడ్ బాద్‌షా షారూక్ ఖాన్, కంపెనీ ఎండీ, సీఈవో ఉన్సూ కిమ్, సంస్థ సీవోవో తరుణ్ గార్గ్ ఉన్నారు.

# తెలంగాణకు ఎఫ్‌డీఐల జోష్

**వెల్లువలా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు**

**2023-24 ప్రథమార్ధంలో రూ.9,679 కోట్లు**

**దేశంలో 27 మైనస్.. రాష్ట్రంలో 21 శాతం ప్లస్**

**స్వయంగా వెల్లడించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ**




న్యూఢిల్లీ, నవంబర్ 21: పారిశ్రామిక వృద్ధితో ముందంజలో ఉన్న తెలంగాణ రాష్ట్రం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్ని (ఎఫ్‌డీఐలు) ఆకర్షించడంలో మొత్తం దేశంలోనే దూసుకెళుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబర్‌లో దేశంలోకి తరలివచ్చిన ఎఫ్‌డీఐ ఈక్విటీ నిధులు డాలర్ల రూపేణా 24 శాతం క్షీణించగా, తెలంగాణలో మాత్రం 21 శాతంపైగా పెరిగాయి.రూపాయిల్లో లెక్కిస్తే రాష్ట్రంలో 27 శాతం వృద్ధిచెందాయి. ప్రపంచంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వరుస వడ్డీ రేట్ల పెంపు వంటి ప్రతికూలతల్ని అధిగమించి తెలంగాణ ఎఫ్‌డీఐల ఆకర్షణలో వృద్ధి సాధించడం గమనార్హం. స్వయానా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ అధీనంలోని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ, ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2023-24 ప్రథమార్థంలో తెలంగాణ రాష్ట్రానికి రూ.9,679 కోట్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. నిరుడు ఇదేకాలంలో ఆకర్షించిన విదేశీ పెట్టుబడులు రూ.7,578 కోట్ల కంటే 27 శాతం వృద్ధిచెందాయి. డాలర్లలో ఇవి 968 మిలియన్ డాలర్ల నుంచి 21.48 శాతం పెరిగి 1,176 మిలియన్ డాలర్లకు చేరినట్టు డీపీఐఐటీ తెలిపింది.

**నాలుగేండ్లలో రూ.45 వేల కోట్లు**

పరిశ్రమలకు స్నేహపూరిత వాతావరణం కల్పిస్తూ ఉపాధిని పెంచే దృష్టితో సానుకూల వాణిజ్య విధానాల్నితెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేపథ్యంలో 2019 అక్టోబర్ నుంచి 2023 సెప్టెంబర్ వరకూ నాలుగేండ్లలో ఏకంగా రూ.45,445 కోట్ల (5.921 బిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐ ఈక్విటీ నిధుల్ని రాబట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోని టాప్ 10 రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణతో పాటు మరో రెండు రాష్ట్రాలు మాత్రమే ఎఫ్‌డీఐలను పెంచుకోగలిగాయి. అవి..పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లు. ఇక మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ, తమిళనాడు, హర్యానాల్లోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గాయి.

**దేశంలోకి 20.48 బిలియన్ డాలర్లే**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబర్ ప్రథమార్ధంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐలు) 24 శాతం క్షీణించి 20.48 బిలియన్ డాలర్లకు తగ్గాయి. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, టెలికం, ఆటోమొబైల్, ఫార్మా రంగాల్లోకి విదేశీ పెట్టుబడులు మందగించినందున, మొత్తంగా నిధుల ప్రవాహం తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ఇవి 26.91 బిలియన్ డాలర్లు. 2023 జనవరి-మార్చి త్రైమాసికంలో సైతం ఎఫ్‌డీఐలు 40 శాతం క్షీణించి 9.28 బిలియన్ డాలర్ల వద్ద నిలిచాయి. ఏప్రిల్-జూన్ మూడు నెలల్లో కూడా 34 శాతం తగ్గి 10.94 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు నెలల్లో పడిపోయిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సెప్టెంబర్‌లో మాత్రం 2022 సెప్టెంబర్‌తో పోలిస్తే 2.97 బిలియన్ డాలర్ల నుంచి 4.08 బిలియన్ డాలర్లకు పెరిగినట్టు డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ, ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) మంగళవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరునెలల్లో సింగపూర్, మారిషస్, యూఎస్, యూకే, యూఏఈ తదితర ప్రధాన దేశాల నుంచి భారత్‌కు ఎఫ్‌డీఐ ప్రవాహం తగ్గింది. నెదర్లాండ్స్, జపాన్, జర్మనీ దేశాల నుంచి మాత్రం పెరిగింది. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ట్రేడింగ్, సర్వీసులు, టెలికమ్యూనికేషన్లు, ఆటోమొబైల్, ఫార్మా, కెమికల్స్ రంగాల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గగా, నిర్మాణ రంగంలో పెరిగాయి.

# రూ.4.74 లక్షల కోట్లకు..

- **రాబోయే పెండ్లిళ్ల సీజన్ వ్యాపారంపై సీఏఐటీ అంచనా**



న్యూఢిల్లీ, నవంబర్ 21: వచ్చే మూడు వారాల్లో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పెండ్లిళ్లు జరుగనుండటంతో వ్యాపార అంచనాలూ అంతే స్థాయిలో వినిపిస్తున్నాయి. ఈసారి దాదాపు 38 లక్షల వివాహాలు జరుగనున్నాయని చెప్తున్నారు. దీంతో ఈ వెడ్డింగ్ సీజన్ వ్యాపారం రూ.4.74 లక్షల కోట్లను తాకవచ్చని అఖిల భారత వర్తకుల సమాఖ్య (సీఏఐటీ) మంగళవారం అంచనా వేసింది. ఈ నెల 23 నుంచి వచ్చే నెల 15 వరకు పెండ్లిళ్లు జోరుగా సాగనున్నాయి.

**లక్ష కోట్లు అదనంగా..**

గత ఏడాది ఇదే పెండ్లిళ్ల సీజన్‌లో జరిగిన వ్యాపారం రూ.3.75 లక్షల కోట్లుగా ఉన్నది. నిరుడు సుమారు 32 లక్షల వివాహాలు జరిగాయి. ఈ క్రమంలో ఈ ఏడాది గతంతో పోల్చితే 6 లక్షల వివాహాలు అధికంగా జరుగనుండటంతో మరో లక్ష కోట్ల రూపాయల వ్యాపారమైనా ఎక్కువగానే జరుగుతుందని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ అంచనా వేస్తున్నారు. దేశవ్యాప్తంగా 30 నగరాల్లోని తమ వర్తక సంఘాల నుంచి వచ్చిన అంచనాల ఆధారంగా ఈ తాజా అంచనాను సీఏఐటీ ప్రకటించింది.

**బంగారం నుంచి..**

సంప్రదాయ వ్యవస్థతో కూడిన మన దేశంలో పెండ్లి అనేది కేవలం ఓ తంతు మాత్రమే కాదు.. అంతకుమించే. ఆయా కుటుంబాల స్థోమతనుబట్టి వీలైనంత వరకు ఘనంగానే ఈ వేడుకను జరిపిస్తారంతా. అందుకే భారత్‌లో వెడ్డింగ్ సీజన్.. మార్కెట్‌కు కొత్త ఉత్సాహాన్ని తెప్పిస్తుంది. పెండ్లి అనగానే రకరకాల పెట్టుపోతలుంటాయి మరి. నగల దగ్గర్నుంచి బట్టలదాకా భారీగానే కొనాల్సి ఉంటుంది. ఇతరత్రా గృహోపకరణాల కొనుగోళ్లూ తప్పనిసరే. దీంతో ఆయా వస్తూత్పత్తుల విక్రయాలు జోరందుకుంటాయి. ముఖ్యంగా బంగారు ఆభరణాలు, వెండి సామాగ్రీ అమ్మకాల్లో వెడ్డింగ్ సీజన్ వాటా ఎక్కువే. ఏటా జరిగే విక్రయాలను చూస్తేనే అర్థమవుతుంది. అలాగే టెలివిజన్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, మిక్సర్-గ్రైండర్లు, వంట సామాగ్రీ అమ్మకాలు ఆకర్షణీయంగానే జరుగుతాయి. వాహన అమ్మకాలూ పెరుగుతాయి. ఇక వధువరుల వస్త్రాలకు పెట్టే ఖర్చు ప్రత్యేకం. పాదరక్షలు, వ్యక్తిగత సౌందర్యాలంకరణ, గృహాలంకరణ ప్రోడక్ట్స్‌కూ డిమాండ్ ఉంటుంది.

**పావు శాతం ఢిల్లీలోనే..**

ఈసారి ఢిల్లీలో 4 లక్షలకుపైగా పెండ్లిళ్లుంటాయని అంచనా. ఫలితంగా దేశవ్యాప్తంగా జరిగే వ్యాపారంలో దాదాపు రూ.1.25 లక్షల కోట్లు ఇక్కడి నుంచే నమోదయ్యే వీలుందని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ఖండేల్వాల్ అంటున్నారు. నవంబర్ 23, 24, 27, 28, 29, డిసెంబర్ 3, 4, 7, 8, 9, 15 తేదీల్లో వివాహాలు జోరుగా ఉంటాయని సీఏఐటీ పేర్కొంటున్నది.



## ఖాన్ మార్కెట్ ఖరీదెక్కువే..

- **చదరపు అడుగు రూ.18,070**

న్యూఢిల్లీ, నవంబర్ 21: ఢిల్లీలోని ఖాన్ మార్కెట్‌లో చదరపు అడుగుకు వార్షిక అద్దె రూ.18,070 (217 డాలర్లు) పలుకుతున్నది. దీంతో ప్రపంచంలోని అత్యంత ఖరీదైన రిటైల్ హై స్ట్రీట్ ప్రాంతాల్లో 22వ స్థానం లభించింది. ఈ మేరకు మంగళవారం 'మెయిన్ స్ట్రీట్స్ ఎక్రాస్ ది వరల్డ్' పేరుతో విడుదల చేసిన జాబితాలో రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ పేర్కొన్నది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లోని కీలక ప్రాంతాల్లో రిటైల్ రెంటల్ రేట్లను పరిశీలించి ఈ రిపోర్టును కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఏటా రిలీజ్ చేస్తున్నది. గత ఏడాది జాబితాలో ఢిల్లీ ఖాన్ మార్కెట్ 21వ స్థానంలో ఉన్నది.

**దేశీయంగా మరికొన్ని..**

దేశంలో అత్యంత ఖరీదైన రిటైల్ హై స్ట్రీట్ లొకేషన్లలో ఢిల్లీ ఖాన్ మార్కెట్ ప్రథమ స్థానంలో ఉండగా, రెండో స్థానంలోనూ ఢిల్లీకే చెందిన కన్నాట్ ప్లేస్ ఉన్నది. ఇక ఆ తర్వాతి స్థానాల్లో లింకింగ్ రోడ్ (ముంబై), గల్లేరియా మార్కెట్ (గురుగ్రామ్), పార్క్ స్ట్రీట్ (కోల్‌కతా) ఉన్నాయని ఈ సందర్భంగా కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ తమ నివేదికలో తెలియజేసింది. న్యూయార్క్‌లోని ఫిఫ్త్ అవెన్యూ.. ఈ ఏడాది కూడా ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన రిటైల్ ప్రాంతంగా నిలిచింది.

# నేడు టాటా టెక్నాలజీస్ ఐపీవో

- **ధరల శ్రేణి రూ.475-500**




న్యూఢిల్లీ, నవంబర్ 21: ఇన్వెస్టర్లు ఆసక్తిగా వేచిచూస్తున్న టాటా టెక్నాలజీస్ తన ఐపీవో తేదీని ప్రకటించారు. డిజిటల్ సర్వీసులకు ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సర్వీసుల్ని అందించే ఈ కంపెనీ పబ్లిక్ ఆఫర్ నవంబర్ 22న ప్రారంభమై 24న ముగుస్తుంది. ఆఫర్ ప్రైస్ బ్యాండ్‌ను రూ.475-500గా నిర్ణయించారు. పలు టాటా గ్రూప్ లిస్టెడ్ కంపెనీలు ఉన్నప్పటికీ, 19 ఏండ్ల తర్వాత ఆ గ్రూప్ నుంచి వస్తున్న ఐపీవో ఇదే. ఐటీ దిగ్గజం టీసీఎస్ పబ్లిక్ ఆఫర్ 2004 ఆగస్టులో వచ్చింది. రూ.850 ధరతో మదుపరులకు లభించిన టీసీఎస్ షేరు బోనస్ ఇష్యూలు, డివిడెండ్లతో సహా ఎన్నో రెట్లు రాబడిని అందించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టాటా టెక్నాలజీస్ ఐపీవోపై మార్కెట్లో క్రేజ్ నెలకొన్నది. అయితే టాటా టెక్నాలజీస్ టాటాల హోల్డింగ్ సంస్థ టాటా సన్స్‌ది కాదు. ఇది ఈ గ్రూప్‌లోని టాటా మోటార్స్‌కు సబ్సిడరీ. తాజా ఐపీవోను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) రూపంలో టాటా మోటార్స్, ఇతర ఈక్విటీ ఫండ్స్ జారీచేస్తున్నాయి. టాటా టెక్నాలజీస్ ఈక్విటీ మూలధనంలో 15 శాతానికి సమానమైన 6,08,50,278 షేర్లను విక్రయిస్తుండటంతో రూ.3,042 కోట్ల నిధులు సమీకరించనున్నట్టు టాటా మోటార్స్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. టాటా మోటార్స్ 11.4 శాతం వాటాల్ని ఆఫ్‌లోడ్ చేస్తున్నది. ప్రైవేటు ఈక్విటీ ఫండ్ అల్ఫా టీసీ హోల్డింగ్స్ 2.4 శాతం, టాటా క్యాపిటల్ గ్రోత్ ఫండ్ 1.2 శాతం చొప్పున షేర్లను విక్రయిస్తున్నాయి. ఇది కాకుండా గత నెలలో 9.9 శాతం వాటాను టీపీజీ రైజ్ క్లైమేట్‌కు రూ.1,613 కోట్లకు అమ్మేందుకు గత నెలలో టాటా మోటార్స్ ఒక ఒప్పందంపై సంతకాలు చేసింది.

**రెండు దశాబ్దాల తర్వాత..**

ఇంచుమించు రెండు దశాబ్దాల తర్వాత టాటా గ్రూపునకు చెందిన మరో సంస్థ స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నది. 2004లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) తర్వాత వస్తున్న తొలి సంస్థ టాటా టెక్నాలజీస్ కానుండటం విశేషం. కంపెనీ ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా ఉండటం, తక్కువ ప్రీమియం ఉండటం, భవిష్యత్తులో ఈ రంగం కీలకంగా ఉండనుంటంతో సంస్థ వాటా విక్రయానికి మదుపరుల నుంచి విశేష స్పందన లభించే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

## టైటాన్‌లో 3 వేల ఉద్యోగాలు




ముంబై, నవంబర్ 21: టాటా గ్రూపునకు చెందిన టైటాన్ భారీ స్థాయిలో ఉద్యోగులను నియమించుకోవడానికి సిద్ధమైంది. వచ్చే ఐదేండ్లలో 3 వేల మందిని నియమించుకోనున్నట్టు ప్రకటించింది. ఇంజినీరింగ్, డిజైనింగ్, లగ్జరీ, డిజిటల్, డాటా అనలిటిక్స్, మార్కెటింగ్, విక్రయ విభాగాల్లో తీసుకోనున్నారు. డాటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్, ఇతర విభాగాల్లో ప్రతిభ కలిగిన సిబ్బందికోసం వెతుకుతున్నట్లు చెప్పారు. వచ్చే ఐదేండ్లలో లక్ష కోట్ల వ్యాపారం లక్ష్యంగా పెట్టుకున్న టైటాన్ అందుకు తగ్గట్టుగానే తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నట్టు, ఇందుకోసం 3 వేల మంది అదనపు సిబ్బందిని నియమించుకోనున్నట్టు తెలిపారు. వీరిలో 15-18 శాతం మందిని క్యాంపస్‌ల నుంచి తీసుకోనున్నారు. సంస్థ తనిష్క్, మియా, ఫాస్ట్రాక్, సొనాట, ఐప్లస్, తనేరియా, స్కిన్, కారట్లేన్ బ్రాండ్లతో భారత్‌తోపాటు అంతర్జాతీయ మార్కెట్లో విక్రయిస్తున్నది.

## మైక్రోసాఫ్ట్ జీడీసీ సెంటర్ అధిపతిగా అపర్ణ గుప్తా



న్యూఢిల్లీ, నవంబర్ 21: టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. గ్లోబల్ డెలివరీ సెంటర్(జీడీసీ) అధిపతిగా అపర్ణ గుప్తాను నియమించుకున్నది. 2005లో హైదరాబాద్‌లో జీడీసీని ప్రారంభించిన సంస్థ..ఆ తర్వాతి కాలంలో ఈ సెంటర్లను బెంగళూరు, నోయిడాకు కూడా విస్తరించింది. మైక్రోసాఫ్ట్ కస్టమర్ అండ్ పార్ట్‌నర్ సొల్యూషన్స్(ఎంసీఏపీఎస్)లో భాగంగా అంతర్జాతీయ కస్టమర్లకు టెక్నాలజీ సేవలు అందించడానికి ఈ సెంటర్లను నెలకొల్పింది సంస్థ. జీడీసీ అధిపతిగా నియమితులైన అపర్ణ..కస్టమర్ ఇన్నోవేషన్, డెలివరీ ఎక్సలెన్స్, క్లౌడ్, ఇండస్ట్రీ, పార్టనర్ ఎకోసిస్టమ్ ద్వారా అందించే సేవలకు ఆమె సారథ్యబాధ్యతలు వహించనున్నారు.

## బైజూస్‌కు నోటీసులు!

న్యూఢిల్లీ, నవంబర్ 21: ఎడ్యుటెక్ సేవల సంస్థ బైజూస్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) షాకివ్వబోతున్నట్టు తెలుస్తున్నది. విదేశీ ఎక్స్ఛేంజ్ చట్టానికి లోబడి రూ.9 వేల కోట్ల నిధుల తరలింపు కేసులో సంస్థ అవకతవకలకు పాల్పడినట్టు కేసులో బైజూస్, కంపెనీ సీఈవో, కో-ఫౌండర్ రవీంద్రన్ బైజూస్‌కు ఈడీ షోకాజ్ నోటీసులు జారీ చేయడానికి ఈడీ సిద్ధమైంది. ఈ విషయాన్ని ప్రభుత్వ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. ఏప్రిల్ నెలలోనే ఈడీ..కంపెనీకి సంబంధించిన కార్యాలయాలపై దాడుల చేసి పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఫేమా నిబంధనలను పట్టించుకోకుండా నిధులను మళ్లించినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టిన ఈడీ..దీనిపై త్వరలో షోకాజ్ నోటీసులు జారీ చేయబోతున్నది.

# పీ-నోట్లు వెలవెల

**అక్టోబర్‌లో తగ్గిన ఆదరణ**

**రూ.1.26 లక్షల కోట్లకే పెట్టుబడులు**




న్యూఢిల్లీ, నవంబర్ 21: భారతీయ క్యాపిటల్ మార్కెట్లలోకి పార్టిసిపేటరీ నోట్స్ (పీ-నోట్స్) ద్వారా వచ్చే పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. అక్టోబర్ ఆఖరుకల్లా దేశీయ ఈక్విటీ, డెట్ మార్కెట్లతోపాటు హైబ్రిడ్ సెక్యూరిటీల్లో పీ-నోట్ల విలువ రూ.1.26 లక్షల కోట్లకే పరిమితమైంది. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ వివరాల ప్రకారం గత నెల 31 నాటికి రూ.1,26,320 కోట్లుగానే ఉన్నాయి. అంతకుముందు నెల సెప్టెంబర్ 30న ఆరేండ్ల గరిష్ఠాన్ని తాకుతూ రూ.1,33,284 కోట్ల వద్ద ఉండటం గమనార్హం. నిజానికి ఈ ఏడాది మార్చి నుంచి వరుసగా ఏడు నెలలు పెట్టుబడులు పెరిగాయి. అయితే గత నెలలో మాత్రం తగ్గాయి. దేశీయ స్టాక్ మార్కెట్లలో నేరుగా నమోదుకాని విదేశీ ఇన్వెస్టర్లకు రిజిస్టర్డ్ ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్స్ (ఎఫ్‌పీఐ) జారీ చేసేవే ఈ పార్టిసిపేటరీ నోట్స్. ఇవి జూలై 2017న రికార్డు స్థాయిలో రూ.1.35 లక్షల కోట్లను తాకాయి. మళ్లీ ఆ దరిదాపుల్లోకి ఈ సెప్టెంబర్‌లోనే వెళ్లాయి. ఇక ఈ ఏడాది జనవరి 31న రూ.91,469 కోట్లుగా ఉన్న పీ-నోట్స్‌ల్లోని పెట్టుబడులు.. ఫిబ్రవరిలో రూ.88,398 కోట్లకు దిగజారాయి. మార్చి ఆఖరున మళ్లీ రూ.88,600 కోట్లకు పెరిగాయి. ఆ తర్వాత ఏప్రిల్‌లో రూ.95,911 కోట్లకు, మేలో రూ.1.04 లక్షల కోట్లకు, జూన్‌లో రూ.1.13 లక్షల కోట్లకు, జూలైలో రూ.1.23 లక్షల కోట్లకు, ఆగస్టులో రూ.1.28 లక్షల కోట్లకు పెరుగుతూపోయాయి.

**స్టాక్ మార్కెట్లలోకే..**

ప్రస్తుత పీ-నోట్స్‌ల్లో ఉన్న పెట్టుబడుల్లో స్టాక్ మార్కెట్లలోకి వచ్చినవే అధికం. రూ.1.18 లక్షల కోట్లు ఈక్విటీలవే. డెట్ మార్కెట్లకు చెందినవి రూ.8,055 కోట్లుగా ఉన్నాయి. హైబ్రిడ్ సెక్యూరిటీల్లో రూ.385 కోట్లుగా ఉన్నాయి. కాగా, ఎఫ్‌పీఐల నుంచి వచ్చే పెట్టుబడుల ఆధారంగానే పీ-నోట్స్‌ల్లో పెట్టుబడుల హెచ్చుతగ్గులుంటాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు, రుణ మార్కెట్లు, హైబ్రిడ్ సెక్యూరిటీల్లోకి ఎఫ్‌పీఐ పెట్టుబడులు పెరిగితే.. పార్టిసిపేటరీ నోట్స్‌ల్లో కూడా పెట్టుబడులు పెరుగుతాయి. ఒకవేళ వాటిలో తగ్గితే పీ-నోట్స్‌ల్లో కూడా తగ్గుతాయి. ఇదిలావుంటే అక్టోబర్ ఆఖరు నాటికి ఎఫ్‌పీఐల కింద ఉన్న ఆస్తులు రూ.56.8 లక్షల కోట్లకు పడిపోయాయి. సెప్టెంబర్ 30న ఇవి రూ.58.45 లక్షల కోట్లుగా ఉన్నాయి. అక్టోబర్‌లో భారతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ఎఫ్‌పీఐలు రూ.24,500 కోట్ల పెట్టుబడుల్ని వెనుకకు తీసుకున్నారు. అయినప్పటికీ ఇదే నెలలో రుణ మార్కెట్లలోకి దాదాపు రూ.6,400 కోట్ల పెట్టుబడుల్ని పెట్టారు. అమెరికా ట్రెజరీ ఈల్డ్స్‌ల్లో పెరుగుదలే.. భారత స్టాక్ మార్కెట్లలో ఎఫ్‌పీఐ పెట్టుబడుల ఉపసంహరణకు కారణమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం కూడా ఇందుకు దోహదం చేసినట్టు చెప్తున్నారు.

# 66 వేలపైకి సెన్సెక్స్

**భారీగా లాభపడ్డ సూచీలు**



ముంబై, నవంబర్ 21: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. మెటల్, బ్యాంకింగ్ షేర్లకు లభించిన మద్దతుతోపాటు ఫెడ్ వడ్డీరేట్ల పెంచే అవకాశాలు లేకపోవడం మదుపరులకు ఉత్సాహాన్నిచ్చింది. అగ్రరాజ్యం అమెరికా ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, ఉద్యోగ కల్పన ఊపందుకోవడంతో వచ్చే సమీక్షలో వడ్డీరేట్లు పెంచే అవకాశాలు లేవని సంకేతాలు మార్కెట్లకు ఊపునిచ్చాయి. ఇంట్రాడేలో 400 పాయింట్లకు పైగా పెరిగి 66 వేల స్థాయిని అధిగమించిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 275.62 పాయింట్లు ఎగబాకి 65,930.77 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 89.40 పాయింట్లు అందుకొని 19,783.40 వద్ద స్థిరపడింది. మార్కెట్ పరిస్థితులు ఆశాజనకంగా ఉండటం, తాజాగా ఫెడ్ మినిట్స్ విడుదలకానుండటంతో మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపిందని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.81 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- టాటా స్టీల్, టైటాన్, రిలయన్స్, సన్ ఫార్మా, టాటా మోటర్స్, భారతీ ఎయిర్‌టెల్‌లు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా, నెస్లె, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, విప్రో షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, టెక్ మహీంద్రా, ఎల్అండ్‌టీ, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, మారుతి, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, కొటక్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఐటీసీ, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి.
- బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు స్వల్పంగా లాభపడ్డాయి.
- రంగాలవారీగా చూస్తే కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.34 శాతం, కమోడిటీ, హెల్త్‌కేర్, ఫైనాన్షియల్ సర్వీసుల షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఎఫ్ఎంసీజీ, ఇండస్ట్రీయల్స్, ఐటీ, టెలికమ్యూనికేషన్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లు నష్టపోయాయి.
- మొత్తం సూచీల్లో 2,018 స్టాక్స్‌లు పెరగగా, 1,701 షేర్లు పతనం చెందగా, 134 యథాతథంగా కొనసాగాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర స్వల్పంగా తగ్గి 81.82 డాలర్లకు చేరుకున్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.